

## అటవీ శాఖలో ఇంటి దొంగలు

అటవీ శాఖలో ఇంటి దొంగల చేతివాటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో..



## ప్రైవేటీకరణపై పోరాటం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /24

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### కలెక్టరేట్‌లో సమీకృత కమాండ్ కంట్రోల్ రూం



కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ రాజాబాబు

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం భవనంలో ఉన్న కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాలను కలెక్టర్ పీ రాజాబాబు శుక్రవారం రాత్రి పరిశీలించారు. కలెక్టరేట్‌లో సమీకృత కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం పీజీఆర్ఎస్ మీకోసం హాలు, ఆడిట్ టీము, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ విభాగం పనిచేస్తున్న కార్యాలయాలను జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ బీ చిన ఓబులేసులతో కలిసి తనిఖీ చేశారు. వీరి వెంట కలెక్టరేట్లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు ఉన్నారు.

### నగరంలో తాగునీటి సరఫరా పరిశీలన



ఎస్ఎస్ ట్యాంకు-2 వద్ద ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో తాగు నీటి సరఫరా తీరును డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెనకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఒంగోలు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. రాంనగర్, సంతపేట, అన్నవరప్పాడు తదితర ప్రాంతాల్లో తాగునీరు సరఫరా అవుతున్న ఎస్ఎస్-2 ట్యాంక్ పరిధిలోని ప్రాంతాలను మునిసిపల్ ఇంజినీర్ యేసయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సరఫరా అవుతున్న తాగునీరు ప్రస్తుతం పరిశుభ్రంగా సరఫరా అవుతున్నట్లు గుర్తించామని డీఎంహెచ్ఓ చెప్పారు. నగరంలో తాగునీరు పైపులు లీకేజి ఉంటే వెంటనే వాటిని మరమ్మతులు చేసి ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని మునిసిపల్ ఇంజినీర్‌కు సూచించారు.



అగ్ని ప్రమాదం సంభవించిన పొగాకు గోడౌన్

# ఎగిసిన కీలల్లో చీకటి కోణం

అంతా చిమ్మచీకటి..తెల్లవారుజాము రెండున్నర గంటల సమయం..జాతీయ రహదారి పక్కన ఉన్న గోదాముల నుంచి ఉవ్వెత్తున మంటలు ఎగసి పడుతున్నాయి. అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. భారీ మంటలను చూసి చుట్టుపక్కల వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపటికి రయ్..రయ్ మంటూ నాలుగు ఫైర్ ఇంజన్లు ప్రమాద స్థలానికి చేరకున్నాయి.. దాదాపు ఏడు గంటలపాటు అగ్నిమాపక దళాలు శ్రమించాయి. ఉదయం పదిగంటల సమయంలో మంటలు కొంత మేరకు అదుపులోనికి తెచ్చారు. సింగరాయకొండకు సమీపంలోని పొగాకు గోదాముల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎగుమతికి సిద్ధంగా ఉన్న రూ. కోట్లు విలువజేసే పొగాకు బూడిదపాలైంది. ఎస్పీ హర్షవర్ధన్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద ప్రమాదం చోటుచేసుకోవడం తొలిసారి. రూ.వందల కోట్ల పొగాకు ఎక్స్‌పోర్టు స్టాకు నిల్వ ఉన్న ఈ గోదాముల్లో జరిగిన ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇది ప్రమాదమా? ఏదైనా కుట్రకోణం దాగి ఉందా అన్న కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

- సింగరాయకొండ జీకే త్రెషర్స్‌లో అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు
- విద్యుత్ షార్ట్ సర్క్యూటేనా?
- రెండు గోదాములకు ఒకేసారి ఎలా వ్యాపించాయన్న అనుమానాలు
- జీకే త్రెషర్స్‌లో షిఫ్టుల వారీగా రౌండ్ ద క్లాక్ వర్కర్లు పనిచేస్తూ ఉంటారు
- షిఫ్టుల వారీ పనులను ఎందుకు ఆపారు
- రూ.550 కోట్లు నష్టం అంటూ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు
- గతంలోనూ టంగుటూరులో పలు పొగాకు గోదాముల్లో అగ్ని ప్రమాదాలు
- ఇటీవల కాలంలో ఇదే పెద్ద అగ్ని ప్రమాదం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

సింగరాయకొండ మండలం కలికవాయ గ్రామ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై బీకే త్రెషర్స్ పొగాకు ఫ్యాక్టరీ ఉంది. ఇందులో నాలుగు గోదాములు ఉన్నాయి. అందులో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పొగాకు మిషన్ల ద్వారా గ్రేడింగ్, క్రషింగ్, ప్యాకింగ్ చేస్తుంటారు. ప్యాకింగ్ పూర్తయిన వాటిని కంటైనర్ల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఇక్కడ సుమారు 400 మంది వరకూ షిఫ్ట్‌వారీగా పనిచేస్తుంటారు. ఈ క్రమంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న 'ఏ, బీ' బ్లాకుల్లో శుక్రవారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మంటలను చూసి పక్క గోదాముల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, యాజమాన్యానికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. పలు అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన తీరు...చోటు చేసుకున్న సంఘటనలను బట్టి చూస్తే ప్రమాదమా లేక కుట్ర కోణమా అన్నది అర్థం కావటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. రూ.వందల కోట్ల పొగాకు ఎక్స్‌పోర్టు స్టాక్ నిల్వ ఉన్న ప్రాంతంలో అంత నిర్లక్ష్యంగా



పొగాకు గోడౌన్‌లో ఎగసిపడుతున్న మంటలు, పొగ



గోడౌన్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఎలా ఉన్నారన్న అంశంపై పలు రకాలుగా ప్రచారాలు సాగుతున్నాయి. నాలుగు గోదాముల్లో కేవలం రెండు గోడౌన్లలో మాత్రమే మంటలు వ్యాపించాయి. ఎక్స్‌పోర్టు క్వాలిటీ పొగాకు ప్యాకింగ్ నిల్వ చేసిన రెండు గోడౌన్లలో ఒకేసారి మంటలు ఏవిధంగా సంభవిస్తాయన్న అనుమానాలు అందరినీ తొలిచేస్తున్నాయి.

**షిఫ్టుల వారీగా రౌండ్ ద క్లాక్ విధులు..**

ఇక్కడ 400 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా రౌండ్ ద క్లాక్ విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే షిఫ్టుల వారీ పనులను ఎందుకు ఆపారు...ప్రమాదం జరిగిన రాత్రి కూడా కార్మికులు త్రెషింగ్ మిషన్లు ఉండే షెడ్లలో కార్మికులు పనిచేస్తున్నారని ఒక వాదన కాగా, మరో వాదన ఏమిటంటే రెండు, మూడు రోజులుగా రాత్రి వేళల్లో కార్మికులకు పనులు ఆపారని ప్రచారంలో ఉంది. ఇవన్నీ అధికారులు విచారణలో కానీ వెలుగులోకి రావన్న ప్రచారమూ సాగుతోంది. ప్రమాదం సంభవించిన తర్వాత జరిగిన ప్రచారానికి, యాజమాన్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు భారీ తేడా ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.550 కోట్ల విలువైన 11 మిలియన్ కేజీల ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ పొగాకు దగ్ధమైందని జీపీఐ కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా మిగతా గోడౌన్లలో ఎంత ఎగుమతికి సంబంధించి స్టాక్ ఉంది. అది కాకుండా ముడి పొగాకు ఎంత ఉంది అనేది తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా నాలుగేళ్ల కిందట సింగరాయకొండలోని బీకే త్రెషర్స్‌లో, టంగుటూరులోని బెల్లం కోటయ్య నివాసాలు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. వీళ్ల ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై సమాచారం సేకరించినట్టు తెలిసింది.

**పొగాకు గోదాముల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు..**

పొగాకు వ్యాపారానికి టంగుటూరు పెట్టింది పేరు. దాంతో చిన్న స్థాయి నుంచి వందల కోట్ల టర్నోవర్‌లు పొగాకు పరంగా టంగుటూరులో జరిగేవి. ఆ సందర్భంలో 1980, 90 దశకంలో ఏడాదిలో రెండు, మూడు పొగాకు గోదాములు తగలబడుతూ ఉండేవి. అప్పట్లో ఒరిజనల్ పొగాకు అమ్మేసుకొని పొగాకు సూర, చెత్త గోడౌన్లలో వేసి తగలబెట్టి రూ.వందల కోట్ల ఇన్సూరెన్స్ తీసుకునే వారని ఆరోపణలు ఉన్నాయి. తరువాత అదే వాస్తమని కూడా తెల్సి అప్పట్లో ఇన్సూరెన్స్ కంపెనీలు కొంతమంది పొగాకు వ్యాపారులపై కేసులు కూడా నమోదు చేశారు. ఆ తరువాతనే జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చాయి. అప్పట్లోనే పొగాకు వ్యాపారి బెల్లం కోటయ్య 1989లో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ(ఎల్ఐసీ) పాలసీ అతని వ్యక్తిగతంగా రూ.కోటి మొత్తానికి ప్రీమియం కట్టారని తెలిసింది. ఆ సమయంలో కోటయ్యను ఆరోగ్య పరీక్షల కోసం ఎల్ఐసీ అధికారులు విమానంలో ముంబైకి తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు కూడా చేయించారు.

### షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం

షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని ప్రాథమిక సమాచారం ప్రకారం భావిస్తున్నాం. గురువారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో నాలుగు సార్లు కరెంట్ ట్రిప్ అయింది. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఉంటుందనుకుంటున్నాం. ఆస్తి నష్టం వివరాలను ఇంకా అంచనా వేయలేదు.

– శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి.

### రూ.550 కోట్ల విలువైన పొగాకు దగ్ధమైందని ఫిర్యాదు చేశారు

పొగాకు గోడౌన్‌లో రూ.550 కోట్ల విలువైన 11 మిలియన్ కేజీల పొగాకు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైందని జీపీఐ కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. దర్యాప్తు అధికారిగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.

– సీఐ సీహెచ్ హజరత్తయ్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

### విద్యుత్ షార్ట్ సర్క్యూటా...పిడుగు పాటా...

పొగాకు త్రెషర్స్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూటా...లేక పిడుగు పాటా అన్నది స్పష్టం కాలేదు. ప్రమాదం సంభవించే సమయానికి ముందు భారీ వర్షం కురిసింది. మెరుపులు కూడా వచ్చాయి. అయితే పిడుగు పడితే ఒకటి, రెండు గోడౌన్లు మాత్రమే ఎందుకు తగలబడతాయన్న అనుమానాలు జోరుగా సాగుతున్నాయి. మంటలు అత్యంత వేగంగా పొగాకు సూర, పొగాకు, పొగాకు ముక్క ఎక్కువగా ఉన్న పెద్ద ఫ్యాక్టరీలో గంట వ్యవధిలో అగ్ని కీలలు అత్యంత వేగంగా వ్యాపిస్తాయి. అలా కాకుండా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయితే ఒక గోడౌన్‌లోనే ప్రమాదం జరగాలి. 20 నుంచి 30 అడుగుల దూరంలో ఉండే రెండో గోడౌన్‌కు అంత తొందరగా మంటలు వ్యాపించవు. ఒకవేళ మంటలు వ్యాపించినా భారీ స్థాయిలో సెక్యూరిటీ ఉన్న ఫ్యాక్టరీలో అంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అగ్నికి ఆహుతి అయిన గోడౌన్లలో ఎగుమతి చేయాల్సిన స్టాక్ ఎంత ఉంది, మిగతా రెండు గోడౌన్లలో ఎంత స్టాక్ ఉంది అన్నది కూడా కూడా స్పష్టంగా తెలియరావడంలేదు. ఫ్యాక్టరీలో అగ్నికీలలు వ్యాపించినప్పుడు ప్రాథమికంగా మంటలు ఆర్పటానికి కావాల్సిన పరికరాలు ఉన్నా వాటిని సిబ్బంది వినియోగించలేదన్నది యాజమాన్యం చెబుతున్న మాటలను బట్టి తెలుస్తోంది.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సురేష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు

సింగరాయకొండ: పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య విద్యను, వైద్యాన్ని దరిచేర్చటానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వ పన్నాగాలను అడ్డుకోవటంతో పాటు పీపీపీ విధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని పాకల గ్రామంలో అభ్యుదయ కళ్యాణ మండపంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ల కొరతను తెలుసుకుని పేదలకు వైద్య విద్యను, వైద్యాన్ని దరిచేర్చే మంచి ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి వాటిలో 5 మెడికల్ కాలేజీలను పూర్తిచేసి ప్రారంభోత్సవం చేయగా రెండు మెడికల్ కాలేజీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన 10 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు పప్పు బెల్లాల రూపంలో అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం పన్నాగాలు పన్నుతోందని ఆరోపించారు. ఎకరా స్థలాన్ని కేవలం ఏడాదికి రూ.100 కు లీజు పద్ధతిన 66 ఏళ్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఒక్కో మెడికల్ కాలేజీ సుమారు 50 ఎకరాల్లో ఉంటుందని ఆ విధంగా ఒక్కో మెడికల్ కాలేజీ ఏడాదికి రూ.5 వేల లీజు పద్ధతిలో అందజేయటానికి పూనుకుందని, ఇంతకంటే దారుణమైన ప్రభుత్వం మరొకటి లేదని ఘాటుగా విమర్శించారు. ఒక్కో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సుమారు రూ.500 కోట్లు అవుతుందని ఆ ప్రకారం 17 మెడికల్ కాలేజీలకు రూ.8,500 కోట్లు అవుతుండగా ఇప్పటి వరకు రూ.3 వేల కోట్ల వరకు జగనన్న ఖర్చు చేశాడని మిగిలిన, రూ.5 వేల కోట్లను సంవత్సరానికి వెయ్యి కోట్ల చొప్పున ఖర్చు చేసి పూర్తి చేయవచ్చని, కానీ డబ్బులు లేవని ప్రైవేటుకు అప్పగిస్తామని చెప్పటం సిగ్గుచేటన్నారు. పేదలకు వైద్యాన్ని, విద్యను దూరం చేయటంలో మంత్రి స్వామి తన వంతు పాత్ర పోషించాడని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకోవటాన్ని దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అన్నారని ఇప్పుడు ప్రైవేటుకు కట్టబెడుతుంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకుందని విమర్శించారు.

పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవస్థలను ప్రైవేటీకరించేందుకే మొగ్గు చూపుతుందని, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తహశీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ లను కూడా ప్రైవేటీకరించినా ఆశ్చర్యం లేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం మెడికల్‌సీట్లు మంజూరు చేస్తానంటే వద్దు అని చెప్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసే పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయటాన్ని దేశచరిత్రలో తీసుకున్న నికృష్టమైన నిర్ణయమని ఎద్దేవా చేశారు. తరువాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు 500 సంతకాలను సేకరించారు. అంతకుముందు వైఎస్సార్, డాక్టర్ కోటారెడ్డి, పూసూరు వెంకారెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వై వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, బచ్చల కోటేశ్వరరావు, చింతపల్లి హరిబాబు, దుద్దుగుంట మల్లిఖార్జునరావు, కేశవరపు కృష్ణారెడ్డి, గొల్లపోతు గోవర్ధన్, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, అంకయ్య, బల్లెల ప్రభాకరరెడ్డి, ఎం శివారెడ్డి, బుర్ల భాస్కరరెడ్డి, పాలెపు మాధవరావు, వినోద్, గొడపేరు రాఘవ, మాధవ, కుర్రు కళ్యాణ్, బుజ్జమ్మ, పున్నయ్య తాతయ్య, విజయ్, పాల్, వాయిల ఆనంద్, ప్రభుదాసు, కాలేషా, షకీలా, ప్రమీల, ప్రళయకావేరి శివ, వీ పెద్ద యలమందయ్య, ఢాకా పిచ్చిరెడ్డి, చొప్పర వెంకన్న, రాపూరి ప్రభావతి, నరేందర్‌రెడ్డి, సుదర్శి వెంకట్రావు, షేక్ సుల్తాన్, చుక్కా కిరణ్‌కుమార్, యనమల మాధవి, కోమిట్ల వెంకారెడ్డి, చొప్పర శివ, పెరికాల సునీల్, షేక్ కరీం, సోమిశెట్టి సురేష్, మాదాల శంకర్, ప్రభాకరరెడ్డి, దాసరి శేషయ్య, భాగ్యమ్మ, నవీన్‌రెడ్డి, భాను, నాగార్జున, చిడిపోతు కృష్ణారెడ్డి, షేక్ నౌషాద్, పుట్టా వెంకట్రావు, ఎం వెంకటాద్రి రెడ్డి, బొక్కిసం సుబ్బారావు, గొట్టిపాటి మురళి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పిల్లి తిరుపతిరెడ్డి, తానికొండ రామచంద్రరావు, నాగినేని భాస్కర్, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, పిన్నిక కమలేష్, నరేష్, సయ్యద్ ఆబిద్ అలీ, షేక్ అల్లాబక్షు, షేక్ పటేల్, మారంరెడ్డి గంగాధరరెడ్డి పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ఆదిమూలపు సురేష్

# 'కల్తీ మద్యం'పై నిరసన

- మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం విచ్చలవిడిగా సరఫరా
- మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ




కల్తీ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు

ఒంగోలు సిటీ: మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ ఒంగోలులోని అంబేద్కర్ భవనం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మహిళా విభాగం నాయకులు ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకొని పది మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం లో డీసీ కి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కార్యాలయం ఎదురు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసిన కల్తీ మద్యం వల్ల మరణాలు ఎక్కువవుతున్నాయన్నారు. అధికార పార్టీ అండతో రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఒక్కొక్కరు ఏరియాలను పంచుకున్నారని విమర్శించారు. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ గంగసాని లక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఇంటి వద్దకే పరిపాలన అని మంచి చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని హోం డెలివరీ చేస్తోందని విమర్శించారు. లిక్కర్ షాపులే ఒక కుంభకోణమన్నారు.

కార్యక్రమంలో హెచ్.ఎం పాడు ఎంపీపీ గాయం సావిత్రి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ, పార్టీ మహిళా నాయకులు సన్నపురెడ్డి రవణమ్మ, గోనెల మేరీ కుమారి, సయ్యద్ అప్సర్, పులి శాంతి, వడ్లమూడి వాణి, కాకర్లమూడి రజిని, జమీల బేగం, నవరం రత్తమ్మ, నెలకుర్తి మహేశ్వరి, పండిటి లక్ష్మి,నాగమణి, మన్యం సంధ్య, పి.లక్ష్మి, కె.సంధ్య, మొలకపల్లి సీతమ్మ, తన్నీరు రాగమ్మ, కే లక్ష్మి, పీ పార్వతి, జీ మాలతి, పీ అమూల్య, జీ తిరుపతమ్మ, రాచూరి సుస్మిత, మాధవి, బత్తుల కోటమ్మ, రాధా, ఎస్ సరిత, ఇండ్ల భాను, ముద్దావనమ్మ, రాచూరి పుష్ప, ఎం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఉత్తర్వులకన్నా.. ఎమ్మెల్యే ఆదేశాలే మిన్న!

- శ్రీసిద్ధి భైరవేశ్వరస్వామి ఆలయ వ్యవహారాల్లో పోలీసుల జోక్యం
- టీడీపీ నేతలు గుడి తాళాలు, హుండీ పగలకొట్టినా కేసు పెట్టని వైనం
- విసిగిపోయి హైకోర్టులో పిటిషన్ వేసిన కమిటీ ప్రెసిడెంట్ శ్రీరంగారెడ్డి
- దీనిపై ఉత్తర్వులనూ పోలీసులు బేఖాతర్
- దీనితో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేసిన శ్రీరంగారెడ్డి

సాక్షి, అమరావతి: హైకోర్టు ఆగ్రహం, ఆదేశాలను పట్టించుకోకుండా పోలీసులు గ్రామస్థాయి మొదలుకుని రాష్ట్ర స్థాయి వరకు అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకే నడుచుకుంటున్నారన్న విషయం పలు దఫాలు స్పష్టమవుతూనే ఉంది. ప్రకాశం జిల్లాలో పేరుగాంచిన శ్రీసిద్ధి భైరవేశ్వరస్వామి ఆలయం ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తోంది.

**బలవంతంగా పగ్గాలు దక్కించుకున్న కూటమి నేతలు**

మూడు దశాబ్దాలుగా ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కమిటీ పగ్గాలను కూటమి నేతలు బలవంతంగా లాక్కున్నారు. గుడి తాళాలు, హుండీలు పగలగొట్టారు. ఈ ఘటనపై వాస్తవ కమిటీ ప్రెసిడెంట్ శ్రీరంగారెడ్డి ఈ ఏడాది జూన్ 19న ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. పైపెచ్చు ఫిర్యాదును ఉపసంహరించుకోవాలంటూ శ్రీరంగారెడ్డినే వేధించడం మొదలుపెట్టారు. దీంతో ఈ మొత్తం వ్యవహారంపై శ్రీరంగారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన హైకోర్టు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాచర్ల పోలీసులను ఆదేశించింది. అయినా రాచర్ల పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. హైకోర్టు ఆదేశాల కన్నా అధికార పార్టీ ఎమ్మెల్యే మాటకే పోలీసులు విలువిస్తున్నారు.

**కోర్టు ధిక్కార పిటిషన్‌ల దాఖలు వరకూ పరిస్థితి..**

దేవస్థానం వ్యవహారాల్లో జోక్యం వద్దని హైకోర్టు ఆదేశించినా వాటిని అమలు చేయకపోవడంతో, శ్రీరంగారెడ్డి రాచర్ల ఏఎస్ఐ వై. ఆదిశేషయ్యపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏఎస్ఐకు నోటీసులు జారీ అయ్యాయి. అలాగే, ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయాలని ఇచ్చిన హైకోర్టు ఆదేశాలను అమలు చేయలేదన్న కారణంగా, ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, రాచర్ల ఎస్‌హెచ్‌వో పి.కోటేశ్వరరావులపై మరో ధిక్కార పిటిషన్ కూడా ఆయన దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ చేపట్టే వీలుంది.

**మరో కుట్రకు శ్రీకారం**

కోర్టు ధిక్కరణ పిటిషన్లు విచారణకు వస్తున్న తరుణంలోనే శ్రీరంగారెడ్డి, ఆయన సోదరుడు నెమిలిరెడ్డిని లక్ష్యంగా చేసుకుంటూ రాచర్ల పోలీసులు తాజాగా కేసు నమోదు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దేవస్థానానికి సంబంధించిన ఆభరణాలను తీసుకున్నారన్నది ఈ కేసు సారాంశం. స్థానిక టీడీపీ నేతల ఒత్తిడి, అధికార పార్టీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోలీసులు శ్రీరంగారెడ్డి, ఆయన సోదరులను భయపెట్టడానికి ఈ తప్పుడు కేసు నమోదైందని పలువురు భావిస్తున్నారు.

## క్లుప్తంగా

### కోతుల దాడిలో మహిళకు గాయాలు


కోతుల దాడిలో గాయపడిన పుల్లమ్మ

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామంలో శుక్రవారం కోతులు దాడి చేయడంతో మునగనూరి పుల్లమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పుల్లమ్మ తన ఇంటిపైన వడియాలు ఆరబోసేందుకు వెళ్లిన సమయంలో కోతుల గుంపు దాడి చేసింది. ఆమె భయంతో మెట్ల మీద నుంచి కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ నెల 5వ తేదీ అంబటి ఈరమ్మ అనే మహిళకు కూడా కోతుల దాడిలో గాయాలయ్యాయి. గత నెల 27వ తేదీ షేక్ సైదమ్మ, ఆకుల రమణమ్మ అనే ఇద్దరిపై కూడా కోతులు దాడిచేయగా, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కోతుల నుంచి స్థానికులను రక్షించాలని పాలకులు, అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

### హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు: హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 ఏప్రిల్ 13న కొండపి మండలం కొండపి గ్రామ పరిధిలోని మద్దులూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సంగన బాలిరెడ్డి నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే మండలం ముక్కోడిపాలేనికి చెందిన కడియం హనుమంతరావు అనే వ్యక్తి మద్యం కావాలంటూ వాచ్‌మన్‌తో గొడవపడ్డాడు. మద్యం ఇవ్వలేదని ఆగ్రహించి గడ్డపారతో దాడి చేసి హత్యచేశాడు. మృతుని భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొండపి పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ ఎం.శ్రీనివాసరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడు కడియం హనుమంతరావుకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితునికి శిక్ష పడేందుకు కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి, పోలీసు సిబ్బందిని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

# అటవీశాఖలో ఇంటి దొంగలు..!

- వారి సహకారంతోనే జోరుగా కలప అక్రమ రవాణా జరుగుతోందని విమర్శలు
- 40కిపైగా నమోదైన వన్యప్రాణుల వేట కేసులు
- సిబ్బంది నిర్లక్ష్యానికి వన్యప్రాణులకు పొంచి ఉన్న ప్రమాదం
- పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండని అధికారులు, సిబ్బంది
- అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు


గిద్దలూరు అటవీశాఖ కార్యాలయం


గిద్దలూరు అటవీశాఖ పరిధిలోని నల్లమల అభయారణ్యం

గిద్దలూరు రూరల్:

అటవీశాఖలో ఇంటి దొంగల చేతివాటంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి సహకారంతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. గిద్దలూరు అటవీశాఖ పరిధిలోని నల్లమల అభయారణ్యంలో వేటగాళ్లు, అటవీ సంపదను కొల్లగొట్టే అక్రమార్కుల అడుగులు పడుతుండటంతో అలజడి ఎక్కువైపోతోంది. దుండగులు అభయారణ్యంలోకి ప్రవేశించేందుకు అటవీశాఖలోని ఇంటి దొంగలు సహకరిస్తున్నారని, అధికారులు, సిబ్బంది సైతం అవినీతికి పాల్పడుతూ పట్టించుకోకుండా వదిలేస్తున్నారని పుకార్లు షికారు చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది అనుమతులు లేనిదే అక్రమార్కులు, వేటగాళ్లు అడవిలో అడుగుపెట్టడం వీలుపడదనే వాదన వినిపిస్తోంది.

**యథేచ్ఛగా వన్యప్రాణుల వేట...**

వేటగాళ్లు సైతం అభయారణ్యంలోకి యథేచ్ఛగా ప్రవేశిస్తూ వారికి కావాల్సిన జంతువులను వేటాడుతున్నారు. ఇటువంటి సంఘటనలు గతంలో అనేకం జరగ్గా.. ఈ నెల 7వ తేదీ సంధ్రపాడు బీటులో ఇద్దరు వేటగాళ్లు నాటుతుపాకీతో అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. 9వ తేదీ రైలులో తరలివెళుతున్న అక్రమ వెదురు కలపను స్వాధీనం చేసుకున్నారు. 2022 నుంచి 2025 వరకు గుండ్లకమ్మ రేంజ్ పరిధిలో దుప్పి, జింక, ఉడుము, కణతి, నెమలి, అడవి పందులు, ఇతర వన్యప్రాణులను వేటాడిన కేసులు 40కిపైగా నమోదయ్యాయి. గిద్దలూరు, తురిమెళ్ల, బేస్తవారిపేట రేంజ్ పరిధిలో 25 కేసులు కలిపి మొత్తం 65 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. వేటగాళ్ల చేతిలో గాయపడిన వన్యప్రాణులకు అటవీశాఖ అధికారులు చికిత్స అందించి సురక్షితంగా అభయారణ్యంలో వదిలిన సంఘటనలు అనేకం జరిగాయి.

**నామమాత్రంగా వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాలు...**

ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను నామమాత్రంగా నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఫలితాలు శూన్యం.

**అడవి అక్కడ.. సిబ్బంది ఇక్కడ..!**

వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న గిద్దలూరు అభయారణ్యాన్ని సంరక్షించే అటవీశాఖ అధికారులు.. వారికి కేటాయించిన పోస్టులకు సంబంధించిన ప్రాంతాల్లో అందుబాటులో లేకుండా దూరంగా నివాసం ఉండటం వల్ల అటవీ సంరక్షణ కష్టతరం అవుతున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు గిద్దలూరు అటవీశాఖ పరిధిలో 6 రేంజ్‌లలో ఏబీఓ పోస్టులు 40 ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీఓలు 7, ఎఫ్ఎస్ఓలు 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత ఉండటం వలన ఉన్న అరకొర సిబ్బందితో అటవీ సంరక్షణ కష్టతరంగా మారింది.

**సిబ్బంది కొరతతో అవస్థలు...**

ఇసుకగుండం నార్త్, ఈస్ట్, మాలకొండపెంట ఈస్ట్, వెస్ట్, ఓబులేసుపెంట, దిగువమెట్ట ఈస్ట్, వెస్ట్, టన్నల్ బీటు, రాచర్ల, ఆకవీడులో మొత్తం 10 బీట్లకుగానూ గుండ్లకమ్మ రేంజ్‌లో ఏబీఓ పోస్టులు 10, దిగువమెట్ట ఠాణాలో 2 కలిపి మొత్తం 12 ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీఓలు 8 మంది పనిచేస్తున్నారు. 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇసుకగుండం, రాచర్ల, మాలకొండపెంట, దిగువమెట్ట బీట్లకు సెక్షన్ ఆఫీసర్లుగా ఎఫ్ఎస్ఓలు నలుగురు ఉండాల్సి ఉండగా, 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఆర్వోగా ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు.

**తురిమెళ్ల, బేస్తవారిపేట రేంజ్‌లలో 8కి 8 ఏబీఓ పోస్టులు ఖాళీ...**

గిద్దలూరు రేంజ్ పరిధిలో కొత్తకోట, సంధ్రపాడు, బోది, ఎస్.ఆర్.పేట, గడికోట కలిపి మొత్తం 5 బీట్లకుగానూ కొత్తకోటలో మాత్రమే ఏబీఓ పనిచేస్తున్నారు. మిగిలిన నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీఓ 1, ఎఫ్ఎస్ఓ 1 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తురిమెళ్ల రేంజ్‌లో పుల్లలచెరువు, జేబీకే పురం, పాపినేనిపల్లె, బొల్లుపల్లె, వెలగలపాయ, పాపినేనిపల్లె-2, పాపినేనిపల్లె ఠాణాలో 2 కలిపి మొత్తం 8 మంది ఏబీఓలు ఉండాల్సి ఉండగా, అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీఓలు 9 మంది ఉండాల్సి ఉండగా, 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎఫ్ఎస్ఓ ఒక్క పోస్టు ఉండగా, ఆ ఒక్కటి ఖాళీగా ఉంది. మూడు డీఆర్ఓలకుగానూ ఒక్క పోస్టు ఖాళీగా ఉంది. బేస్తవారిపేట రేంజ్ పరిధిలో తాటిచెర్ల, నల్లగుంట్ల, చింతలపల్లె, జె.పి.చెరువు, చిన్న ఓబినేనిపల్లె, సింగసానిపల్లె, అల్లినగరం, గుంతపల్లిలో 8 ఏబీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీఓలు 8 మందికిగానూ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎఫ్ఎస్ఓలు ముగ్గురు ఉండాల్సి ఉండగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఆర్వో ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

**అక్రమంగా కలప తరలింపుతో బిక్కుబిక్కుమంటున్న వన్యప్రాణులు...**


అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తూ ఇటీవల పట్టుబడిన వెదురు కలప

గిద్దలూరు అటవీశాఖ పరిధిలో గుండ్లకమ్మ రేంజ్, తురిమెళ్ల రేంజ్, బేస్తవారిపేట రేంజ్, గిద్దలూరు రేంజ్, స్క్వాడ్ రేంజ్, డీఈటీ రేంజ్ కలిపి మొత్తం 6 రేంజ్‌లకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు ఉన్నారు. అందులో గిద్దలూరు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి స్క్వాడ్ రేంజ్‌కి ఇన్‌చార్జిగా, గుండ్లకమ్మ రేంజ్ ఆఫీసర్ నరసింహారావు డీఈటీ రేంజ్‌కి ఇన్‌చార్జిగా, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు బేస్తవారిపేట రేంజ్‌కి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గిద్దలూరు అటవీశాఖ పరిధిలో అభయారణ్యం సుమారు 10 వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. గిద్దలూరు రేంజ్‌లోని గుండ్లమోటు, గుండ్లకమ్మ రేంజ్ పరిధిలోని కుక్కల గుండం, ఇసుకల గుండం నుంచే కాకుండా నంద్యాల జిల్లా పచ్చర్ల అటవీప్రాంతం నుంచి సైతం అక్రమంగా వెదురు, ఇతర కలప తరలిస్తున్నారు. అక్రమంగా కలప తరలించే వారు అభయారణ్యంలో ఎలా అడుగు పెడుతున్నారు.. అక్రమంగా కలప ఎలా తరలిస్తున్నారనే ప్రశ్నలకు సమాధానం లభించడం లేదు. కలప, వెదురు నరికే వారి గొడ్డలి చప్పుళ్లకు వన్యప్రాణులు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నాయి.


2023 డిసెంబర్ 23న అడవిలో కణతిని చంపిన నిందితుడితో అటవీశాఖ సిబ్బంది


వేటగాళ్లను అరెస్ట్ చేసి నాటు తుపాకులు, బైకులను స్వాధీనం చేసుకున్న సిబ్బంది (ఫైల్)


2024 మార్చి 27న వేటగాళ్ల చేతిలో గాయపడిన చుక్కల దుప్పికి చికిత్స చేయిస్తున్న గుండ్లకమ్మ రేంజ్ అటవీశాఖ అధికారులు

# ప్రైవేటీకరణపై పోరాటం


మార్కాపురంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కేవీ రమణారెడ్డి, షంషేర్ ఆలీబేగ్, నాయకులు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఉద్యమం
- కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభం
- వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు విద్యార్థులకు వైద్య విద్యను కూడా అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు వివరించారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టడం బాధాకరమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు చెప్పారు. మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కళాశాలలను నిలిపివేయడంతోపాటు ఇటీవల కాలంలో వాటిని ప్రైవేటీకరణ చేస్తూ పీపీపీ విధానంలో నిర్మించాలని టెండర్లను ఆహ్వానించడం దారుణమని అన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో మెడికల్ కళాశాలల నిర్వహణ ఉంటే పేదలకు ఉచితంగా వైద్యం ఎలా అందుతుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల నుంచి కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని నవంబరు 22వ తేదీ వరకూ గ్రామాలు, పట్టణాల్లో వాడవాడలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న మార్కాపురం నియోజకవర్గ కేంద్రాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను 23న జిల్లా కేంద్రాలకు పంపనున్నట్లు వెల్లడించారు. అనంతరం 24న పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించిన తరువాత రాష్ట్ర గవర్నర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఇది రాజకీయ లబ్ధి కోసం చేసేది కాదని, ప్రజలందరూ స్వచ్ఛందంగా సంతకాల సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, మార్కాపురం, కొనకనమిట్ల ఎంపీపీలు లక్ష్మీదేవీ కృష్ణారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, మార్కాపురం, కేకే మిట్ల జెడ్పీటీసీలు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు పీఎల్‌పీ యాదవ్, పార్టీ పట్టణ కన్వీనరు సలీమ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పొదిలి పట్టణ, మండల కన్వీనర్లు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, చంద్ర శేఖర్, రోజ్‌లిడియా, ముత్తారెడ్డి వెంకట రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి గొలమారి సత్యనారాయణ రెడ్డి, పార్టీ నాయకులు బట్టగిరి తిరుపతి రెడ్డి, శేషయ్య, కొండయ్య, గౌస్ మొహిద్దీన్, కేకే మిట్ల వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


పామూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

- వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

పామూరు: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనుకోవడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గం మధ్యలో పామూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంకె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, పేద విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు ఏకంగా 17 వైద్య కళాశాలలకు అనుమతులు సాధించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇప్పటికే 7 కళాశాలల నిర్మాణాలు పూర్తికాగా మరో 10 కళాశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయా వైద్య కళాశాలలపై సవతి తల్లి ప్రేమ చూపుతూ వాటి ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం అత్యంత హేయమని అన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ పోరాటాలకు సిద్ధమవుతోందన్నారు. కోటిసంతకాల సేకరణ చేపట్టి గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. కూటమి పాలనా పగ్గాలు చేపట్టిన 15 నెలల్లోనే ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందని, మద్యం బెల్ట్ దుకాణాలతో గ్రామాల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని, పేదల కుటుంబాలు బజారున పడుతున్నాయని జంకె ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు కల్తీ మద్యంతో కోట్లు దండుకుంటూ ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అనంతరం జంకెను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, టీచర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పాలేటి ప్రేమ్‌కుమార్, చల్లా సుబ్బారావు, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీనివాసులు, వెలుతుర్ల తిరుపతిరెడ్డి, షేక్ రసూల్, చింతంరెడ్డి బాలిరెడ్డి, కోటపాటి రమణారెడ్డి, వాకమళ్ల కోటిరెడ్డి, తాతిరెడ్డి నరసారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశాలు బేఖాతరు

- ప్రభుత్వం మాది.. ఎవరు అడ్డొస్తారో చూస్తా..
- టీడీపీ నాయకుడి దౌర్జన్యం
- పత్తి పంటను దున్నివేసి.. ఆపై పొలానికి హద్దుల ఏర్పాటు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

దొనకొండ: కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ లెక్కచేయకుండా టీడీపీ నాయకుడు దౌర్జన్యంగా పొలానికి హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఘటన దొనకొండ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వద్దిపాడు గ్రామానికి చెందిన తొలుచూరి చిన్నయ్య సర్వే నంబర్ 174లో తాను కొనుగోలు చేసిన 7.80 ఎకరాలను కుమారుడు కోటయ్యకు, అల్లుడు గుమ్మా కొండయ్యకు సమానంగా 1992లో జాయింట్ రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో పాటు సర్వే నంబర్ 166/2లో 1.66 ఎకరాలు, 158/2లో 0.83 ఎకరాలు అల్లుడు కొండయ్యకు రిజిస్ట్రేషన్ చేశాడు. తద్వారా మొత్తం 6.39 ఎకరాలు కొండయ్యకు దక్కింది. అప్పటి నుంచి వారు ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కొండయ్య మతి స్థిమితం కోల్పోయాడు. దానిని ఆసరాగా చేసుకుని కొండయ్యకు చెందిన 6.39 ఎకరాలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తాడి నారాయణరెడ్డి తన బినామీ తోట వెంకట రమణ పేరున 2022 మే నెలలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొండయ్య మృతి చెందడంతో ఈ మొత్తం వ్యవహారంపై తొలుచూరి కోటయ్య, ఆయన సోదరి, గుమ్మా కొండయ్య భార్య పెద్ద కోటమ్మ అదే ఏడాది సెప్టెంబర్‌లో దర్శి జూనియర్ కోర్టులో ఇంజెక్షన్ దావా వేశారు. విచారణ జరిపిన కోర్టు వీరికి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. నేటికీ ఆ ఉత్తర్వులు అమల్లో ఉన్నాయి. అయితే, వారం కిందట దౌర్జన్యంగా కాపు దశలో ఉన్న 6.39 ఎకరాల పత్తి పంటను టీడీపీ నాయకుడు తాడి నారాయణరెడ్డి దున్నేశాడు. అంతటితో ఆగకుండా తన అనుచరులతో పొలం దగ్గరికి వెళ్లి హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి రెవెన్యూ సిబ్బంది సహకరించి పొలం చుట్టూ రాళ్లు పాతించారు. తమను ఎవరు ఏం చేస్తారనే అహంకారంతో ప్రభుత్వం మాది, మా ఇష్టం, మా వద్దకు వచ్చే వారెవరో చూస్తాం, ఏదైనా చేస్తామంటూ సుమారు 40 మందితో దౌర్జన్యంగా శుక్రవారం పొలం దగ్గరికి వెళ్లారు. మోసంతో ప్రభుత్వం అండదండలతో తన భర్త కొండయ్యతో తాడి నారాయణరెడ్డి రిజిస్ట్రేషన్ చేసుకోవటం చాలా అన్యాయమని, ఏమైనా అంటే నీ సంగతి చూస్తామని బెదిరిస్తున్నాడని గుమ్మా పెద్ద కోటమ్మ వాపోయింది. కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ వేసినా పట్టించుకోకుండా ఇలా దౌర్జన్యం చేయడం దుర్మార్గమని పెద్ద కోటమ్మ, ఆమె తమ్ముడు తొలుచూరి కోటయ్య ఆరోపించారు. ఇలాంటి దౌర్జన్యాలు వద్దిపాడు గ్రామంలో ఎప్పుడూ జరగలేదని, నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెచ్చిపోతూ అన్యాయాలకు పాల్పడుతున్నారని కోటయ్య ఆరోపించారు.

### డ్రోన్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి


ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి జిల్లా పరిస్థితి వివరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: డ్రోన్ పెట్రోలింగ్‌ను ముమ్మరంగా నిర్వహించాలని, జిల్లాలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు తరచూ గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం కావాలని, గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుతో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత నేర పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మహిళలపై జరిగే నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థిక నేరాలలో టాప్ 10 స్థానాలలో ఉన్న వారిపై నిఘా ఉంచాలన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలపై దృష్టి సారించాలని చెప్పారు. నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, సీఐలు పాల్గొన్నారు.

### 13న ఒంగోలులోనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఒంగోలు వన్‌టౌన్: ఈ నెల 13వ తేదీ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనే కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన ప్రకారం 13న మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో జరగాల్సి ఉండగా, తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఆ రోజు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని మీటింగ్ హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలంతా గమనించాలని కోరారు.